సాక్షి పల్నాడు
ఆదివారం । 27 । జూలై । 2025





## 31న కృష్ణానదికి మహావస్త్ర సమర్పణ

నాగాయలంక: కృష్ణానదికి ఈనెల 31న మహా వస్త్ర సమర్పణ వేడుక నిర్వహిస్తున్నట్లు నాగాయలంక శ్రీరామపాద క్షేత్రం కమిటీ చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు తెలిపారు.



## గోవింద నామ పారాయణం

తెనాలిటౌన్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకుని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో భక్తులు శనివారం గోవిందనామం, హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు.

## గుండిపార్వతి అమ్మవారికి విశేష పూజలు



భట్టిప్రోలు: గ్రామ హిందూ శ్మశానవాటికలో కొలువైన గుండిపార్వతి అమ్మవారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు కార్తికేయశర్మ పూజలు జరిపారు.

## న్యూస్‌రీల్

### పత్తి పంటకు బీమా గడువు పొడిగింపు

నరసరావుపేట రూరల్: వాతావరణ ఆధారిత పంటల బీమా పథకంలో పత్తి పంటకు బీమా గడువు ఈనెల 31వ తేదీ వరకు పొడిగించినట్టు జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు శనివారం తెలిపారు. భారత ప్రభుత్వ రంగ బీమా సంస్థ అగ్రికల్చర్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా జిల్లాలో పంటల బీమా అమలులో ఉందని తెలిపారు. రైతులు పత్తి పంటపై అమలవుతున్న బీమా పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. రుణాలు తీసుకున్న రైతులు బ్యాంకుల ద్వారా నమోదు చేయబడతారని తెలిపారు. రుణాలు తీసుకోని రైతులు మీ సేవా కేంద్రాలు, ఇన్సూరెన్స్ ఏజెంట్లు , క్రాప్ ఇన్సూరెన్స్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చని తెలిపారు. గ్రామ సచివాలయంలో వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలను సంప్రదించి నమోదు చేసుకోవాలని తెలిపారు. వాతావరణ సంబంధిత ప్రమాదాల సమయంలో పంటలకు కలిగే నష్టాన్ని బీమా ద్వారా పొందే అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలని కోరారు.

### ప్రత్యేక పీజీఆర్ఎస్‌లో 38 అర్జీలు స్వీకరణ



నరసరావుపేట: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీల కోసం శనివారం కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధ్యక్షతన ప్రత్యేక ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారి నుంచి 38 అర్జీలు స్వీకరించారు. వీటిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆదేశిస్తూ సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేశారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, డీఆర్‌ఓ ఏకా మురళి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### రూ.2.75 కోట్ల విలువైన 20 పనులకు పొడా ఆమోదం



నరసరావుపేట: జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో రూ.2.75 కోట్లతో చేసే 20 పనులకు పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ కమిటీ (పొడా) ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. శనివారం కలెక్టరేట్‌లో పొడా వైస్ చైర్మన్, జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే అధ్యక్షతన అభివృద్ధి, ప్రణాళికా కార్యకలాపాలపై అథారిటీ నాల్గవ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరు అజెండాలపై చర్చించి ఏకగ్రీవంగా ఆమోదం తెలియచేశారు. దీనిలో అథారిటీ సభ్యులు డీటీసీపీ అసిస్టెంట్ డైరెక్టర్ బి.సునీత, రోడ్లు, భవనాల శాఖ ఇంజినీర్ టి.రవీంద్రబాబు, ఏపీసీపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.రాంబాబు, జిల్లా పర్యాటక అధికారి నాయుడమ్మ, కాలుష్య నియంత్రణ మండలి విభాగ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా పారిశ్రామిక కేంద్ర కార్యదర్శి ఎం.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

### 581 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్:నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 581.30 అడుగులకు చేరింది. ఇది 286.7635 టీఎంసీలకు సమానం. సాగర్ జలాశయం నుంచి కుడి కాలువకు 511, ఎస్ఎల్‌బీసీకి 1,800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 1,20,339 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

జిల్లాలోని ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో సౌకర్యాలు కొరవడుతున్నాయి. ముఖ్యంగా హాస్టళ్లలోని విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదు. నాసిరకమైన కూరగాయలతో వండి పెడుతున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. సంక్షేమ హాస్టళ్లలో పరిసరాలు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. సంక్షేమ వసతి గృహాల నిర్వహణకు ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా చెల్లించడం లేదని చీపురు, ఫినాయిల్ లాంటివి కొనుగోలు చేసేందుకు కూడా నిధులు లేకపోవడంతో నిర్వహణ ఎలా సాధ్యమని హాస్టల్ వార్డెన్లు ప్రశ్నిస్తున్నారు. 'సాక్షి' శనివారం జిల్లాలోని పలు హాస్టళ్లను విజిట్ చేయగా సమస్యలు వెలుగుచూశాయి.



చిలకలూరిపేట పట్టణంలోని బీసీ బాలుర హాస్టల్‌లో మరుగుదొడ్డి దుస్థితి

# సంక్షేమంలో కొరవడిన సంతోషం

- పలుచని సాంబారు .. రుచి లేని భోజనం
- విద్యార్థులకు అందని బెడ్‌షీట్లు, పేట్లు, గ్లాసులు
- నెలలతరబడి అందని కాస్మోటిక్ చార్జీలు
- అవస్థలతో తప్పని సహవాసం
- జిల్లాలో 44 ప్రీ మెట్రిక్, 28 పోస్ట్ మెట్రిక్ వసతి గృహాలు

## సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు సమస్యల స్వాగతం



నరసరావుపేట పెద్దచెరువులోని ఎస్సీ బాలుర హాస్టల్‌లో నేలపై పడుకున్న విద్యార్థులు

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

సత్తెనపల్లి: జిల్లాలో ప్రీ మెట్రిక్ బీసీ 20, ఎస్సీ 18, ఎస్టీ 6, పోస్ట్ మెట్రిక్ బీసీ 14, ఎస్సీ 11, ఎస్టీ మూడు హాస్టళ్లు ఉన్నాయి. వీటిల్లో సుమారు 7,500 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. బడుగు, బలహీనవర్గాల పిల్లలు ఉండే సంక్షేమ వసతి గృహాలు సమస్యల ఊబిలో చిక్కుకున్నాయి. అసౌకర్యాల మధ్య రేపటి పౌరులు కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వ వసతి గృహాల నిర్వహణను కూటమి ప్రభుత్వం విస్మరించింది. హాస్టళ్లు పునఃప్రారంభమై దాదాపు రెండు నెలలు గడుస్తున్నా ఒక్క రూపాయి కూడా విదల్చలేదు. కొన్ని చోట్ల భవనాలు శిథిలావస్థకు చేరాయి. పెచ్చులూడి ప్రమాదకరంగా మారాయి. మరుగుదొడ్లకు తలుపులు లేవు. కిటికీలకు దోమతెరలు లేవు. వర్షాకాలంలో దోమలు విజృంభిస్తుండడంతో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారు. ఈ ఏడాది ఇంతవరకు బెడ్‌షీట్లు ఇవ్వలేదు. అద్దె భవనాల్లో సరైన వసతులు లేక విద్యార్థులు అల్లాడి పోతున్నారు.

### సక్రమంగా అమలు కాని మెనూ

ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. నాసిరకమైన భోజనం పెడుతున్నా వారిని ప్రశ్నించేవారు లేరు. గత ప్రభుత్వం వసతి గృహాల్లోని విద్యార్థుల కోసం ప్రత్యేకంగా మెనూ ప్రకారం భోజనం అందించేది. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక వసతి గృహాల్లోని విద్యార్థుల పట్ల పర్యవేక్షణ కొరవడింది. దీనికి తోడు ఇటీవల కూరగాయల ధరలు భారీగా పెరిగాయి. దీంతో నిర్వాహకులు నాసిరకమైన కూరగాయలు తెచ్చి వాటితోనే విద్యార్థులకు భోజనం చేసి పెడుతున్నారు. ఆ ఆహారం తిన్న విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. దీనికి తోడు వంటగది, బాత్‌రూములు అపరిశుభ్రంగా ఉంటున్నాయి. అయితే నిర్వాహకులు మాత్రం నిధులు కాజేస్తున్నారనే మాటలు వినిపిస్తున్నాయి.

### అమరావతిలో అరకొర వసతులు

అమరావతి మండలం ధరణికోటలోని బీసీ, ఎస్సీ హాస్టళ్లలో 50 శాతం విద్యార్థులు కూడా లేని పరిస్థితి ఉంది. ఎస్సీ హాస్టల్‌లో మూడు నుంచి తొమ్మిదో తరగతి వరకు మొత్తం 25 మంది విద్యార్థులు ఉన్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో 23 మంది విద్యార్థులు ఉన్నారు. స్నానాల గదులు ఉన్నప్పటికీ వాటికి తలుపులు లేవు. హాస్టల్‌కు ఉత్తరాన క్రోసూరు రోడ్డు వైపు ప్రహరీ లేకపోవటంతో అకుపచ్చపట్ట కట్టారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

### పాములకు నిలయంగా బీసీ బాలుర హాస్టల్



కోటప్పకొండలో కొండ పక్కగా ఉన్న బీసీ బాలుర వసతి గృహం మరుగుదొడ్లు

నరసరావుపేట మండలం కోటప్పకొండ బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోటప్పకొండలోని జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలోనే ఉన్న ఈ హాస్టల్‌కు ప్రకాశం జిల్లాతోపాటు వినుకొండ ప్రాంతాల నుంచి విద్యార్థులు వచ్చి చేరుతుంటారు. కొండ పక్కనే ఈ వసతి గృహం ఉండటంతో పాములు హాస్టల్ ప్రాంగణంలోకి తరచూ వస్తున్నాయి. మరుగుదొడ్లు ఆరు బయట ఉండటంతో రాత్రి వేళల్లో బయటకు వెళ్లాలంటే విద్యార్థులు భయపడాల్సి వస్తుంది. దీంతోపాటు విద్యార్థులకు సరిపడా మరుగుదొడ్లు అందుబాటులో లేవు. విద్యార్థులు స్నానాలు చేసేందుకు సమీపంలోని త్రికోటేశ్వర జెడ్పీ హైస్కూల్‌పై ఆధారపడాల్సి వస్తుంది. హాస్టల్ ఆధునీకరించి మంచాలు అందుబాటులోకి తీసుకొచ్చారు కానీ గదులకు తలుపులు ఏర్పాటుచేయలేదు. హాస్టల్‌లో వార్డెన్ అందుబాటులో ఉండకపోవడం, సీనియర్ విద్యార్థుల వేధింపులు, నాణ్యమైన ఆహారం ఇవ్వకపోవడం వంటి కారణాలతో ఈ ఏడాది విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. గత ఏడాది 80 మంది విద్యార్థులు ఉన్న హాస్టల్‌లో ఈ ఏడాది 30 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. గత నెల 31వ తేదీ హాస్టల్ వార్డెన్ ఉద్యోగ విరమణ చేయగా, నూతనంగా మరో వార్డెన్‌ను ఉన్నతాధికారులు నియమించారు.



సత్తెనపల్లి వెంకటపతికాలనీలోని ఎస్సీ బాలికల వసతి గృహం ఆవరణలో పేరుకున్న చెత్త



పెచ్చులూడిపోతున్న రాజుపాలెం బీసీ బాలుర వసతి గృహం శ్లాబ్



రాజుపాలెం బీసీ బాలుర వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

### అందని కాస్మోటిక్ ఛార్జీలు

ప్రీ మెట్రిక్ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే 3–6 తరగతుల బాలురకు నెలకు ఒక్కొక్కరికి రూ.175, బాలికలకు రూ.130, 7నుంచి 10 వరకు చదివే బాలురకు రూ.200, బాలికలకు రూ.200 కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలి. అలాగే పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల్లో ఉంటూ విద్యనభ్యసించే విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.250 కాస్మోటిక్ చార్జీలను ప్రభుత్వం ప్రతి నెలా చెల్లించాలి. 2024 సెప్టెంబర్ నుంచి ప్రీ మెట్రిక్ వసతి గృహాల విద్యార్థులకు, 2024 మార్చి నుంచి పోస్ట్ మెట్రిక్ వసతి గృహాల విద్యార్థులకు కాస్మోటిక్ చార్జీలు రావాల్సి ఉంది. ఇవి ప్రతి నెలా అందకపోవడంతో విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతోపాటు దుస్తులు శుభ్రపరుచుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. కొందరు విద్యార్థులు మురికి దుస్తులతోనే పాఠశాలలకు, కళాశాలలకు వెళుతూ అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికైనా సంక్షేమ వసతి గృహాల పట్ల పాలకులు, జిల్లా అధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

### అద్దె భవనంలోనే 'సంక్షేమం'

వినుకొండ పట్టణంలో సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహం శిథిలావస్థకు చేరింది. దీంతో రెండేళ్లుగా అద్దె భవనంలోనే వసతిగృహం నిర్వహిస్తున్నారు. స్నానపు గదులు మాత్రం లేక విద్యార్థులు ఇక్కట్లు పడుతున్నారు. 80 మందికి మూడు మరుగుదొడ్లు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ నూతన భవనం ఏర్పాటుకు ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో విద్యార్థుల పాలిట శాపంలా మారింది.

### వందల మందికి ఒక్కరే వంట మనిషి

జిల్లాలో 14 బీసీ, 11 ఎస్సీ, 9 ఎస్టీ పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో సుమారు 3 వేల మంది విద్యార్థులు ఉన్నారు. ఒక్కొక్క హాస్టల్‌లో 100 మందికి పైగానే విద్యార్థులు ఉన్నారు. సత్తెనపల్లిలోని వెంకటపతి కాలనీలోగల ఎస్సీ పోస్ట్‌మెట్రిక్ బాలికల వసతి గృహంలో 340 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇంత మందికి ఒక్కరే వంట మనిషి ఉన్నారు. ఇది ఎలా సాధ్యం అనేది కనీసం జిల్లా స్థాయి అధికారులు ఆలోచన చేయకపోవడం గమనార్హం. ఇది సాధ్యం కాక ప్రతి హాస్టల్‌లో అదనంగా ఇరువురిని వార్డెన్లు నియమించుకొని చేతి చమురు వదిలించుకుంటున్నారు. ఇలా ప్రతి వసతి గృహంలో ఏదో ఒక సమస్య విద్యార్థులను వెంటాడుతుంది. ప్రభుత్వం వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

### వర్షం కురిస్తే చిత్తడే..

నరసరావుపేట పెద్దచెరువు 9వ లైనులో ఓ ప్రైవేటు బిల్డింగ్‌లో కొనసాగుతున్న ఎస్సీ బాలుర హాస్టల్, ప్రకాష్‌నగర్‌లోని బీసీ బాలుర హాస్టల్‌లో 4వ వాల్గవ తరగతి నుంచి బీటెక్ చదివే సుమారు 280 మంది విద్యార్థులు ఉంటున్నారు. వర్షం కురిస్తే ఎస్సీ హాస్టల్ మొత్తం చిత్తడి చిత్తడిగా తయారవుతుంది. కొన్ని గదుల్లోకి నీరు వస్తుంది. ఒకటీ, రెండు గదుల్లో సగం నీరు ఉండగా మిగతా సగంలో ఓ విద్యార్థి పడుకొని ఉండటం కన్పించింది. డ్రమ్ముల్లో పట్టిన నీటినే విద్యార్థులు తాగునీరుగా ఉపయోగిస్తున్నారు. హాస్టల్ మొదటి అంతస్తు కారిడార్ మధ్యలో నీరు పోయేందుకు కాలువ ఏర్పాటుచేశారు. విద్యార్థులు పడుకునేందుకు ఎక్కడా బెడ్లు లేవు. గదుల్లో నేలపై చాపలు, దుప్పట్లు పర్చుకొని పడుకుంటున్నారు. బీసీ బాలుర హాస్టల్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న విద్యార్థులు సామూహికంగా స్నానాలు చేస్తున్నారు. బియ్యంలో ముక్కపురుగులు ఉన్నాయి.



నరసరావుపేట పెద్దచెరువు ఎస్సీ బాలుర హాస్టల్ గదిలోకి చేరిన వర్షపు నీరు

# కూటమి అరాచకాన్ని తిప్పికొడదాం

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్‌సెల్ అధ్యక్షులు మనోహరరెడ్డి
- నరసరావుపేటలో వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ న్యాయవాదుల సదస్సు



మాట్లాడుతున్న మనోహరరెడ్డి, వేదికపై మాజీమంత్రి రజని, మాజీ ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి, బొల్లా, సత్తెనపల్లి సమన్వయకర్త డాక్టర్ సుధీర్ భార్గవరెడ్డి, సీనియర్ న్యాయవాదులు

నరసరావుపేట: రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వ అరాచకాన్ని తిప్పికొట్టడంలో లీగల్ సెల్ న్యాయవాదులు సమష్టిగా పనిచేయాలని వైఎస్సార్ సీపీ లీగల్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు మల్లసాని మనోహరరెడ్డి పేర్కొన్నారు. రామిరెడ్డిపేటలోని ఓ ఫంక్షన్ హాలులో జిల్లా పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నేతృత్వంలో జిల్లా అధ్యక్షురాలు, న్యాయవాది రోళ్ల మాధవి అధ్యక్షతన శనివారం నిర్వహించిన పార్టీ లీగల్‌సెల్ సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అరాచకం పరాకాష్టకు చేరిందన్నారు. ప్రభుత్వమే రాక్షస పాలన సాగిస్తుందని, బాధితులు ఎక్కువగా పల్నాడు జిల్లాలోనే ఉన్నారన్నారు. పిన్నెల్లి లాంటి గ్రామాల్లో వందలమంది ఊరువిడిచి పెట్టి వెళ్లాల్సి వచ్చిందన్నారు. జిల్లా అధ్యక్షులు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, మాచర్ల మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిషోర్‌పై అనేక అక్రమ కేసులు పెట్టారన్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు లీగల్ సెల్ ప్రతినిధులు అద్భుతంగా పనిచేశారని, ప్రభుత్వం పెట్టే అక్రమ కేసులను ఛేదించి నాయకులు, కార్యకర్తలను బయటికి తీసుకొస్తున్నారన్నారు. పార్టీ కోసం పనిచేసిన వారందరినీ గుర్తుపెట్టుకుంటుందని హామీ ఇచ్చారు. సమావేశంలో తొలుత దివంగత వైఎస్సార్ ప్రతిమకు పూలమాల వేసి నివాళులర్పించారు. సీనియర్ న్యాయవాదులు కట్టా నారపరెడ్డి, పక్కాల సూరిబాబు, చల్లా రామిరెడ్డి మాట్లాడారు. మాజీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూటర్ సుదర్శనరెడ్డి, గుంటూరు జిల్లా అధ్యక్షులు భగవాన్, జిల్లాలోని ఏడు నియోజకవర్గాలకు చెందిన లీగల్‌సెల్ న్యాయవాదులు నరేంద్ర, వై.సీతారామిరెడ్డి, చిట్టిబాబు, సీహెచ్.నాగిరెడ్డి, ఎం.ఎన్.ప్రసాదు, హరిప్రసాదు, పెద్దసంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.

### ప్రతి ఇంట్లో ఒక న్యాయవాది అవసరం

పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటన న్యాయవాదుల ప్రాధాన్యతను తెలియచేసింది. ప్రతి ఇంట్లో ఒక న్యాయవాది ఉండాలనే ఆలోచన కూటమి ప్రభుత్వం రేకెత్తిస్తుంది.

–డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి, సమన్వయకర్త, సత్తెనపల్లి

### కార్యకర్తల సంరక్షణే లక్ష్యం కావాలి

కార్యకర్తలను పోలీసులు కొట్టకుండా వారి చెర నుంచి బయటకు తీసుకురావటమే లక్ష్యంగా లీగల్ సెల్ సభ్యులు పనిచేయాలి. నాయకులు, కార్యకర్తలపై ఏవిధంగా కేసులు పెట్టాలో, ఏఏ సెక్షన్లు బనాయించాలో, రిమాండ్ రిపోర్టు ఎలా తయారుచేయాలో టీడీపీ సెంట్రల్ ఆఫీస్ నుంచి పోలీసులకు సమాచారం ఇస్తున్నారు. పల్నాడు జిల్లాలోని నాయకులు, కార్యకర్తలు అత్యధికంగా రాజకీయపరమైన కేసులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో లీగల్ సెల్ అవసరం ఎంతో ఉంది. ఎక్కడైనా కేసులు బనాయించిన సత్వరమే స్పందించి న్యాయ సహాయం అందిస్తున్నారు.

–డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు

### పోలీసులను శిఖండిగా మార్చిన ప్రభుత్వం



కూటమి ప్రభుత్వ పెద్దలు పోలీసులను శిఖండిగా వినియోగిస్తూ వారిచేత వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలను కొట్టిస్తున్నారు. పోలీసులు చేస్తున్న అరాచకాలపై ఖచ్చితంగా ప్రైవేట్ కేసులు వేయాల్సిన అవసరం ఉంది.

–కాసు మహేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, గురజాల

### పోలీసులపై ప్రైవేటు కంప్లయింట్



పోలీసులు పార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తే ఏ లీగల్‌సెల్ సభ్యుడు ఊరుకోవద్దు. అక్రమాలకు, అరాచకాలకు పాల్పడిన పోలీసులపై ఖచ్చితంగా ప్రైవేట్ ఫిర్యాదు చేస్తాం.

–రోళ్ల మాధవి, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షురాలు

### లీగల్‌సెల్ పాత్ర కీలకం

రాష్ట్రంలో రెడ్‌బుక్ పాలనలో లీగల్ సెల్ న్యాయవాదుల ప్రాముఖ్యత తెలియచేస్తుంది. తనతోపాటు అనేక మంది నాయకులపై ఈ ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధిస్తుంది. తాను రాజకీయాల్లో కొనసాగుతున్నానంటే అందుకు లీగల్‌సెల్ సహకారమే కారణం.

–విడదల రజిని, మాజీ మంత్రి

### మాకు రక్షణ లీగల్‌సెల్ న్యాయవాదులే

తమకు రక్షణ కల్పిస్తుందని లీగల్‌సెల్ న్యాయవాదులే. పార్టీ కార్యకర్త రషీద్‌ను అత్యంత దారుణంగా హత్య చేశారు. ఈ కేసులో నిందితులైన కొంతమంది టీడీపీ నాయకుల పేర్లు ఎఫ్ఐఆర్ నుంచి తొలగించారు. లీగల్ సెల్ ప్రతినిధులు కోర్టులో న్యాయపోరాటం చేసి ఆ పేర్లు తిరిగి ఎఫ్ఐఆర్‌లో చేర్పించారు. లీగల్‌సెల్ కమిటీకి ప్రాధాన్యం ఇవ్వాలి. పార్టీ కోసం పనిచేస్తున్న వారందరినీ గుర్తుపెట్టుకుని పదవులు ఇస్తాం.

–బొల్లా బ్రహ్మనాయుడు, మాజీ ఎమ్మెల్యే, వినుకొండ

## అలరించిన గరికపాటి ప్రవచనాలు



డాక్టర్ గరికపాటిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, నాగసరపు గుప్తా

**నరసరావుపేట:** స్థానిక పాతూరులోని శ్రీ పట్టాభి రామస్వామి దేవాలయంలో శనివారం సాయంత్రం ఆధ్యాత్మిక తరంగిణి, శ్రీ నాగసరపు సుబ్బరాయ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన వేదాంత భేరీ ప్రవచనానికి మహా సహస్రావధాని, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ గరికపాటి నరసింహారావు హాజరై ప్రవచనాలు వినిపించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు, ట్రస్టు చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్తాలు డాక్టర్ గరికపాటిని ఘనంగా సన్మానించారు. పట్టణానికి చెందిన పలువురు ప్రముఖులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ర్యాంప్ నోడల్ అధికారిగా కృష్ణారావు

**నరసరావుపేట:** అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా పనిచేసేందుకు జిల్లా పరిశ్రమల అధికారి జి.కృష్ణారావును నోడల్ అధికారిగా నియమించారు. ఆయా మండలాల స్పెషల్ ఆఫీసర్ల ర్యాంపు ప్రోగ్రాం ప్రత్యేక పర్యవేక్షణ చేసేందుకు కలెక్టర్ శనివారం ఈ ఆదేశాలు జారీచేశారు. ప్రతి నియోజకవర్గస్థాయిలో ఎంఎస్ఎంఈ–ర్యాంపు కార్యక్రమం నిర్వహించేలా షెడ్యూల్‌ను తయారుచేసి ప్రతి ఒక్క మండల ప్రత్యేక అధికారికి ప్రణాళిక ప్రకారం ఇవ్వాలని సూచించారు. ఎంఎస్ఎంఈ – ర్యాంపు కింద రిజిస్ట్రేషన్ వర్క్‌షాప్, జేఈడీ వర్క్‌షాప్, రివర్స్ బయర్ సెల్లర్ మీటింగ్, వెండర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం, ప్యాకేజింగ్ అండ్ బ్రాండింగ్ టెక్నిక్స్, ట్రేడ్ రేసివబుల్స్‌పై కార్యక్రమం నిర్వహించాలని నోడల్ అధికారి, సంబంధిత అధికారులను ఆదేశించారు. డీఆర్‌డీఏ పీడీ, మెప్మా పీడీ, ఎల్‌డీఎం, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి పాల్గొన్నారు.



# మహానాడులో యువకుడు ఆత్మహత్య

- గుట్టుచప్పుడు కాకుండా ఖననం
- టీడీపీ నాయకుడి వల్లే తన కుమారుడు చనిపోయాడంటున్న తల్లి
- ఫిర్యాదు తీసుకోని పోలీసులు



మాట్లాడుతున్న బాజీ తల్లి మొహమ్మద్ మునీనురీసా



ఆత్మహత్య చేసుకునే ముందు బాజీ గోడపై రాసిన దృశ్యం

**సాక్షి, టాస్క్‌ఫోర్స్:** తన మరణానికి సైదులు అనే టీడీపీ నాయకుడు కారణమంటూ ఓ యువకుడు గోడపై రాసి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. యువకుడి కుటుంబ సభ్యులు తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి రాగా, కొడుకు మరణించాడన్న బాధలో ఉన్న వారిని అవమానించడంతో వారు బయటకు వచ్చి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మృతుడి తల్లి మొహమ్మద్ మునీనురీసా మాట్లాడుతూ.. తన కుమారుడైన ఎం.డి. బాజీ (31) ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఈ నెల 23వ తేదీన ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. ఎందుకు చనిపోయాడో తమకు తెలియక 24వ తేదీ మృతదేహాన్ని ఖననం చేశామని చెప్పారు. ఖననం అనంతరం ఇంటిని శుభ్రం చేస్తుండగా గోడమీద 'తన మరణానికి ఎస్‌డీ సైదులు, రాకేష్ కారణం అని, చంపుతామని బెదిరించారని, వారు టీడీపీ నేతలని, తాను ఏం చేయగలవంటూ బెదిరించినట్లు' కుమారుడు రాశాడని తెలిపారు. ఈ విషయాన్ని 25వ తేదీన పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయగా ఖననం చేసి తమ దగ్గరకు వస్తే ఏం చేయలేమని పోలీసులు పేర్కొన్నట్లు చెప్పారు. తమ కుమారుడి చావుకు కారణం వాళ్లు ఎందుకు అవుతారని ప్రశ్నించారని తెలిపారు. గోడపై కుమారుడు రాసిన విషయాన్ని సెల్‌ఫోన్‌లో ఫొటో తీసి చూపించగా తాము కేసు కట్టబోమని, బయటకు వెళ్లాలని, ఎవరి దగ్గరకు వెళ్లినా న్యాయం జరగదని, ఇకనైనా జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కృష్ణానది ఒడ్డున తమ కుమారుడికి అన్నయ్య వరుస అయ్యే వారిని సైదులు కొట్టాడని, అప్పుడే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, కేసు వాపస్ తీసుకుంటారా లేదా అంటూ అనేకసార్లు బెదిరించారని ఆమె తెలిపారు. 23వ తేదీన కూడా సైదులు, రాకేష్‌లు కత్తి తీసుకుని చంపేస్తామని, తమది టీడీపీ అని చెప్పినట్లు ఆ తల్లి ఆవేదన వ్యక్తం చేశారు. కుమారుడి మరణానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకపోతే పోలీస్‌స్టేషన్ దగ్గర నిరాహార దీక్ష చేస్తామని ఆమెతోపాటు బాజీ కుటుంబ సభ్యులు హెచ్చరించారు.

## డిప్యూటీ సీఎం వ్యాఖ్యలకు సాక్ష్యాలు అందించాం

- పోలీసులు చర్యలు తీసుకోవాలి
- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నారాయణ మూర్తి



సీఐ వీరేంద్రబాబుకు సాక్ష్యాలను అందజేస్తున్న నారాయణ మూర్తి

**తాడేపల్లి రూరల్:** డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ప్రజలను రెచ్చగొడుతూ చేసిన అనుచిత వ్యాఖ్యలపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు నాగ నారాయణమూర్తి తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. డిప్యూటీ సీఎం మాట్లాడినట్లు సీఐ సాక్ష్యాలు అడగడంతో శనివారం నారాయణమూర్తి ఆ సాక్ష్యాల వీడియో ఫుటేజీని పెన్‌డ్రైవ్ ద్వారా అందజేశారు. ఈ సందర్భంగా నాగ నారాయణమూర్తి, మాదిగ కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ వర్కింగ్ ప్రెసిడెంట్ కొమ్మూరు కనకారావు మాట్లాడుతూ... 'పవన్ కళ్యాణ్ తమ కార్యకర్తలతో చంపండి... నరకండి.. అది సివిలైజేషన్' అంటూ రెచ్చగొట్టే విధంగా మట్లాడారని చెప్పారు. సీఐకి సాక్ష్యాలు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధాకర్ రెడ్డి, వి.రవీంద్రారెడ్డి, బి.నరేంద్ర సింగ్, ఎస్‌కే జావీద్ బాషా, హాసన్ తదితరులు పాల్గొన్నారు.

## మిషన్ గ్రీన్ గుంటూరు లోగో డిజైన్లకు ఆహ్వానం

**నెహ్రూనగర్:** స్వచ్ఛ గుంటూరు – క్లీన్ గుంటూరు కాన్సెప్ట్‌లో మిషన్ గ్రీన్ గుంటూరు నినాదంతో లోగో కోసం డిజైన్లను ఆహ్వానిస్తున్నామని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెస్ట్ డిజైన్‌గా ఎంపికైన డిజైనర్‌కు నగదు బహుమతి, ప్రశంసా పత్రాన్ని అందిస్తామని చెప్పారు. గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో ఈ సీజన్‌లో దశలవారీగా 5 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంతో వార్డులవారీగా కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పర్యావరణహిత గుంటూరే లక్ష్యంగా పచ్చదనం పెంపు, పారిశుద్ధ్య పనులలో మెరుగుదల, వ్యర్థాలను తడిపొడిగా వేరు చేసి తీసుకోవడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగం, విక్రయం నిషేధం, నగరంలోకి వచ్చే ప్రధాన మార్గాలు, జంక్షన్లు, ఐలాండ్స్, పార్క్‌లు, డివైడర్లపై పచ్చదనం పెంపు వంటి చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఆగస్టు ఒకటవ తేదీ నుంచి ప్రత్యేక డ్రైవ్ మోడ్‌లో క్షేత్రస్థాయి నుంచి అమలుకు కృషి చేస్తామని తెలిపారు. అందులో భాగంగా చేపట్టిన మిషన్ గ్రీన్ గుంటూరుని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేలా డిజైన్‌లు ఆహ్వానిస్తున్నామన్నారు. సెల్ఫ్ డిక్లరేషన్, పేరు, ఫోన్ నంబర్ తదితర వివరాలతో ఆగస్టు 15వ తేదీలోపు నగరపాలక సంస్థ వాట్సాప్ నంబర్ 98499 08391కు పంపవచ్చని తెలిపారు. ఆగస్టు 15 అనంతరం ఉత్తమ డిజైన్ ఎంపిక ఉంటుందన్నారు.

# ఇంటర్ సంస్కరణలపై అవగాహన అవసరం

జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి



**నరసరావుపేట ఈస్ట్:** ఇంటర్మీడియెట్ విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఈ విద్యా సంవత్సరం నుంచి సంస్కరణలను అమలు చేస్తున్నట్టు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎం.నీలావతిదేవి తెలిపారు. ఇంటర్మీడియెట్ విద్యా సంస్కరణలపై శనివారం హార్ద్ కళాశాలలో అవగాహన సమావేశం నిర్వహించారు. పల్నాడుజిల్లా పరిధిలోని అన్ని ప్రైవేటు, ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సమావేశానికి హాజరయ్యారు. సమావేశంలో నీలావతిదేవి మాట్లాడుతూ, విద్యార్థులను జాతీయస్థాయి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా తీర్చిదిద్దటమే లక్ష్యంగా సిలబస్ రూపకల్పన జరిగిందని తెలిపారు. అలాగే అన్ని రంగాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేలా సిలబస్ ఉంటుందని తెలిపారు. జాతీయస్థాయిలో మేధావులు, నిపుణులు, విద్యావేత్తలు, తల్లిదండ్రుల సూచనల మేరకు సంస్కరణల అమలుకు కార్యాచరణ తీసుకవస్తున్నట్టు వివరించారు. దుర్గి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపాల్ కె.వేణు ఇంటర్ బోర్డు ప్రవేశ పెట్టిన నూతన సిలబస్, నూతన సబ్జెక్స్ కాంబినేషన్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో దాచేపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ టి.జె. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

# క్రైస్తవుల రక్షణకు పటిష్ట చట్టం తేవాలి

పలు క్రైస్తవ సంఘాల డిమాండ్



మాట్లాడుతున్న డాక్టర్ గోళ్లమూడి రాజ సుందరబాబు

**నరసరావుపేట:** భారత రాజ్యాంగం ప్రకారం లౌకిక రాజ్యాంగం మేరకు క్రైస్తవ మైనార్టీల రక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకమైన చట్టం రూపొందించి వారిని ఆదుకోవాలని సామాజికవేత్త, జాతీయ క్రైస్తవ, దళిత నాయకుడు డాక్టర్ గోళ్ళమూడి రాజ సుందరబాబు పేర్కొన్నారు. శనివారం స్థానిక బాపనయ్యనగర్ బేతేలు చర్చిలో యూపీఎఫ్ జిల్లా కార్యవర్గం, నేషనల్ క్రిస్టియన్ బోర్డు జిల్లా కార్యవర్గాల ఆధ్వర్యంలో పాస్టర్ల సమావేశం నిర్వహించారు. దీనిలో ముఖ్యవక్తగా గోళ్లమూడి పాల్గొని ప్రసంగిస్తూ 2023లో మణిపూర్‌లో 65వేల కుటుంబాలను మారణ హోమానికి గురిచేసిన సంఘటనపై క్రైస్తవులు దేశంవ్యాప్తంగా భయాందోళనకు గురయ్యారన్నారు. ఈ ఏడాది మార్చిలో రాష్ట్రంలో ప్రపంచ సువార్తికుడు పాస్టర్ పగడాల ప్రవీణ్ మృతిపైనా ఆందోళనలు వ్యక్తమయ్యాయన్నారు. అదే విధంగా రాష్ట్రవ్యాప్తంగా చర్చిలు, పాస్టర్లపై దాడులు పెరిగాయన్నారు. పాస్టర్లు స్వేచ్ఛగా సువార్త ప్రకటించుకునే అవకాశం లేకుండా పోయిందన్నారు. సమావేశానికి సత్తెనపల్లికి చెందిన షాలోమ్ చర్చి వ్యవస్థాపకులు పాస్టర్ సుధీర్ కుమార్ అధ్యక్షత వహించారు. యూపీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్‌సీ రావు, మాజీ అధ్యక్షుడు జీవరత్నం, నేషనల్ క్రిస్టియన్ బోర్డ్ జిల్లా అధ్యక్షుడు పి.సుబ్బారావు(జోసఫ్) మాట్లాడారు. వివిధ చర్చిల పాస్టర్లు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్




నిరసన వ్యక్తం చేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

**గుంటూరు ఎడ్యుకేషన్:** బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా ఉపాధ్యాయులకు ఇప్పటి వరకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రాజశేఖరరావు, ఎం.కళాధర్‌లు అన్నారు. వేతన చెల్లింపులో జాప్యాన్ని నిరసిస్తూ శనివారం డీఈవో కార్యాలయం ఎదుట యూటీఎఫ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. నాయకులు మాట్లాడుతూ డీఏలు, పీఆర్సీపై ప్రభుత్వం నోరు మెదపటం లేదన్నారు. రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం.హనుమంతరావు మాట్లాడుతూ ఉపాధ్యాయుల జీతాల విషయంలో తాత్సారం తగదన్నారు. ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలని పేర్కొన్నారు. రోజూ రకరకాల అప్‌లోడ్ పనులతో టీచర్లను బోధనకు దూరం చేస్తున్నారని, ఇది పరోక్షంగా ప్రభుత్వ విద్యను కాలరాయడమే అన్నారు. టీచర్లకు రకరకాల శిక్షణ ఇచ్చి బోధనను ఆటంకపరుస్తూ ఉంటే ప్రయోజనం ఏమిటని ప్రశ్నించారు. ఇక నుంచైనా ఆన్‌లైన్ పనులు ఆపి అధికారులు సహకరించాలని కోరారు. అనంతరం డీవైఈవో ఏసురత్నంకు వినతి పత్రం సమర్పించారు. నిరసన ప్రదర్శనలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, జి.వెంకటేశ్వరరావు, ఎం.గోవిందు, బి.ప్రసాదు, ఆడిట్ కమిటీ సభ్యులు ఎం.కోటిరెడ్డి, కె.ప్రేమ్ కుమార్, గుంటూరు నగర అధ్యక్షుడు ఎం. చిన్నయ్య, మండల శాఖ నాయకులతోపాటు బదిలీ అయిన ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# చోరీ కేసులో ముగ్గురు నిందితులు అరెస్ట్

141 గ్రాముల బంగారు, అర కేజీ వెండి నగలు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ రామాంజనేయులు

**కర్లపాలెం:** మండల పరిధిలోని దమ్మనవారి పాలెంలో బంగారు, వెండి ఆభరణాల చోరీ కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 141 గ్రాముల బంగారం, అర కేజీ వెండి, రూ.5 వేలు నగదు స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల రూరల్ సీఐ హరికృష్ణ, కర్లపాలెం ఎస్ఐ రవీంద్ర చాకచక్యంగా దర్యాప్తు చేసి వారిని అరెస్ట్ చేశారని బాపట్ల డీఎస్పీ రామాంజనేయులు తెలిపారు. శనివారం కర్లపాలెం పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. దమ్మనవారిపాలెం గ్రామానికి చెందిన పిట్టు పెద వెంకటరెడ్డి కుటుంబం ఈ నెల 17వ తేదీన ఇంటికి తాళాలు వేసి ఊరికి వెళ్లినట్లు తెలిపారు. 21వ తేదీన వారి ఇంటి వెనుక తలుపులు తెరిచి ఉన్నట్లు ఆయన తమ్ముడు గమనించి సమాచారం ఇచ్చారని పేర్కొన్నారు. 22వ తేదీన వెంకటరెడ్డి వచ్చి చూడగా బీరువాలోని బంగారు, వెండి ఆభరణాలు, నగదు చోరీ అయినట్లు గుర్తించారన్నారు. పాత నేరస్తులే చోరీకి పాల్పడ్డారని పోలీసులు తెలుసుకున్నారని చెప్పారు. నిందితులు బాపట్ల మార్కెట్ యార్డ్ సమీపంలో సంచరిస్తుండగా అరెస్ట్ చేశారని తెలిపారు. రాజమహేంద్రవరం పరిధి కొల్లమూరు గ్రామానికి చెందిన జనది వృశేఖర్, పురంపుల్లతి వీధికి చెందిన లంక హర్షవర్ధన్, బాపట్ల మండలం మరుప్రోలువారిపాలెంకు చెందిన మరుప్రోలు నాగేంద్రరెడ్డిలను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వీరు పాత నేరస్తులని, జైలులో పరిచయాల మేరకు బయటకు వచ్చిన తరువాత చోరీలు చేస్తున్నట్లు చెప్పారు. చోరీ సొత్తు పూర్తిగా రికవరీ చేసినట్లు వివరించారు. మరో నిందితుడు పరారీలో ఉన్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ తుషార్ డూడీ అభినందించారని వివరించారు. వారికి వ్యక్తిగత రివార్డులు అందిస్తామని తెలిపారు.

## రైతులు సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి




కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు

**గుంటూరు రూరల్:** నగర శివారులోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానం నందు శనివారం జూలై నెలకు సంబంధించిన శిక్షణ, సందర్శన వర్క్‌షాప్‌ను నిర్వహించారు.
కార్యక్రమానికి లాంఫాం ఏడీఆర్ దుర్గాప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో వివిధ డివిజన్‌ల ఏడీఏలు వ్యవసాయ స్థితిగతులు వివరించారు. శాస్త్రవేత్తలు పత్తి, కంది పంటల కట్ ఆఫ్ డేట్స్, వివిధ ప్రాంతాలకు అనువైన వరి రకాలు, నేరుగా విత్తన వరిలో కలుపు యాజమాన్యం, జీవన ఎరువుల వినియోగం, ఎండు తెగులును తట్టుకునే కంది రకాలు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికలు వంటివి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్‌లో పంట వేయకుండా ఖాళీగా ఉంచి అనంతరం శనగ వేయదలచిన రైతులు స్వల్పకాలిక అపరాలు సాగు చేపట్టవచ్చని తెలిపారు. డీఏవో నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏటీఎంఏ సహకారంతో వ్యవసాయశాఖ, యూనివర్సిటీ ఆధ్వర్యంలో రైతులకు ఉపయోగకరమైన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సీజన్ ప్రారంభమైన సందర్భంగా విస్తరణ కార్యక్రమాలు, క్షేత్ర సందర్శనలు చేపట్టాలన్నారు. నానో ఎరువులు వినియోగం, డ్రోన్ల ద్వారా పురుగు మందుల పిచికారి, జీవన ఎరువుల పనితీరు, మెషీన్ హార్వెస్టను అనుకూలమైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు రైతులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో పల్నాడు జిల్లా డీఏవో శివకుమారి, వివిధ పంటల ప్రధాన శాస్త్రవేత్తలు, వివిధ డివిజన్ల ఏడీఏలు, కేవీకే, డాట్, ఉద్యాన, పరిశోధన శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

## గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు

దుగ్గిరాలలో 63.8 మి.మీ. వర్షపాతం

**కొరిటెపాడు (గుంటూరు):** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో గత పది రోజులుగా గుంటూరు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలో శుక్రవారం ఉదయం నుంచి శనివారం ఉదయం వరకు అత్యధికంగా దుగ్గిరాల మండలంలో 63.8 మిల్లీ మీటర్లు పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.4 మి.మీ. వర్షపాతం కురిసింది. సగటున 16.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి.. కొల్లిపర మండలంలో 45.4 మి.మీ., తుళ్ళూరు 28.2, తాడికొండ 25.6, మంగళగిరి 25, పెదకాకాని 20, తాడేపల్లి 19.6, గుంటూరు తూర్పు 17.6, గుంటూరు పశ్చిమ 16.2, ఫిరంగిపురం 8.2, తెనాలి 6.4, చేబ్రోలు 4, పెదనందిపాడు 3.6, కాకుమాను 3.4, మేడికొండూరు 3.4, ప్రత్తిపాడు 2.6, వట్టిచెరుకూరు మండలంలో 2.4 మి.మీ. చొప్పున వర్షపాతం పడింది. జూలై 26వ తేదీ వరకు జిల్లాలో సాధారణ వర్షపాతం 138.3 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 228.2 మి.మీ. నమోదైంది.

## ముగ్గురు హెచ్‌ఎంలకు ఎంఈఓలుగా అదనపు బాధ్యతలు

**గుంటూరు ఎడ్యుకేషన్:** గుంటూరు జోన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మూడు మండలాలకు ఎంఈవో–1లుగా అదనపు బాధ్యతలపై నియమిస్తూ పాఠశాల విద్య ఆర్జేడీ బి.లింగేశ్వరరెడ్డి శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. గుంటూరు వెస్ట్ ఎంఈవో–1గా గుంటూరులోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.హవీలా, పెదకాకాని ఎంఈవో–1గా గుంటూరులోని పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం బీవీ రమణయ్య, చేబ్రోలు ఎంఈవో–1గా చేబ్రోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఆర్. చలపతిరావును నియమించారు.

## పిచ్చికుక్క దాడిలో వ్యక్తి మృతి

**మార్టూరు:** పిచ్చికుక్క దాడిలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన మండలంలోని కోలల పూడి గ్రామంలో శనివారం జరిగింది. బాధిత కుటుంబ వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కోలలపూడి గ్రామంలో ఈనెల మొదటి వారంలో ఓ పిచ్చికుక్క 12 మంది వ్యక్తులపై విచక్షణారహితంగా దాడి చేసింది. దాడిలో గాయపడిన వారిలో కొందరు మార్టూరు, మరికొందరు గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్నారు. వారిలో స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన గాలి యేసులు (65) చికిత్స చేయించుకున్నప్పటికీ గత నాలుగు రోజులుగా పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న యేసులు శుక్రవారం రాత్రి మృతి చెందగా.. శనివారం మృతదేహాన్ని కొలలపూడి తరలించారు.

## విలువైన కార్డులు అప్పగింత

**బల్లికురవ:** విలువైన ఏటీఎం కార్డులు, చెక్ బుక్కులు, డిజిటల్ ప్యానెళ్లు పోగొట్టుకున్న వ్యక్తి వివరాలు తెలుసుకుని అప్పగించడంతో శనివారం ఎస్సై వై. నాగరాజు అభినందించారు. పల్నాడు జిల్లా పిట్టంబండ గ్రామానికి చెందిన ఆర్. బాలాజీసింగ్ వృత్తి రీత్యా డిజిటల్ పేమెంట్ ప్యానెళ్ల వ్యాపారంచేస్తున్నాడు. పల్నాడు, బాపట్ల, గుంటూరు జిల్లాలో బైక్‌పై తిరుగుతుంటాడు. విధి నిర్వహణలో భాగంగా శనివారం మేదరమెట్ల – నార్కెట్‌పల్లి నామ్ రహదారిలోని కొప్పరపాడు గ్రామం మీదుగా వరపల్ల వెళుతుండగా మార్గ మధ్యంలో విలువైన బుక్స్, కార్డులు, ప్యానెళ్లు, పాస్‌బుక్‌లు, చెక్‌బుక్కుల బ్యాగ్ బైకుపై నుంచి కిందపడింది. కొప్పరపాడు గ్రామానికి చెందిన దివ్యాంగుల సంఘ అధ్యక్షుడు దమ్ము అంజయ్య బైక్‌పై బల్లికురవ వెళుతూ బ్యాగ్ గమనించి.. దానిని తీసుకెళ్లి పోలీస్ స్టేషన్‌లో ఎస్సైకి అప్పగించారు. వివరాలు సేకరించి.. బాధితుడిని పిలిపించి అప్పగించారు. ఎంతో విలువైన తన బ్యాగ్‌ను అప్పగింటం పట్ల బాలాజీ సింగ్ కృతజ్ఞతలు తెలిపారు.